మార్కెట్ యార్డు నిర్మాణం జరిగేనా..!

- రూ.1.34 కోట్లతో ప్రతిపాదనలు
- స్థలం ఎంపికలో జాప్యం
- అవస్థలు పడుతున్న రైతులు



పందిళ్ల కింద టామాటా మండీ నిర్వహిస్తున్న వ్యాపారులు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ మార్కెట్ యార్డు నిర్మాణ పనులు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. యార్డు నిర్మాణానికి అవసరమైన స్థలం ఎంపికకు రాజకీయ గ్రహణం పట్టుకొంది. యార్డు నిర్మాణానికి ఆరేళ్ల క్రితమే రూ.1.34 కోట్లు మంజూరు చేశారు. ప్రస్తుతం టీటీడీ స్థలాల్లో టమాటా మండీలు నిర్వహించుకొంటున్నారు. యార్డు నిర్మాణాలు చేపట్టకపోవడంతో రోజురోజుకు మండీలు మూతపడుతున్నాయి. దీంతో చేసేదిలేక రైతులు బయట ప్రాంతాల మార్కెట్లకు టమాటాలను తీసుకెళ్లి విక్రయిస్తున్నారు.

రైతులకు అనుకూలం

తరిగొండలో టమాటా మార్కెట్‌యార్డు నిర్మాణంతో సుమారు 62 గ్రామాల రైతులకు ఎంతో అనుకూలంగా ఉంటుంది. తరిగొండ, రామాపురం, శెట్టివారిపల్లె, టి.రాచపల్లె, మర్రిపాడు, అమిలేపల్లె, మర్రిమాకులపల్లె పంచాయతీలతోపాటు కలకడ, వాల్మీకిపురం మండలాల్లోని కొన్ని గ్రామాలకు తరిగొండ అనుకూలంగా ఉంటుంది. వందలాది మంది రైతులు తాము సాగు చేసుకొంటున్న టమాటాలను బయట ప్రాంతాలకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. యార్డు నిర్మాణాలు చేపడితే రైతులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. గతంలో రైతులు, టమాటాలతో కళకలాడిన మార్కెట్‌యార్డు నేడు సరైన వసతులు లేక వెలవెలబోతోంది.

వసతులు లేక అవస్థలు

మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో రూ.1.34 కోట్లతో యార్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. ఇందుకు సంబంధించిన సాంకేతిక అనుమతులు కూడా వచ్చాయి. అయినా నిర్మాణాలు మాత్రం చేపట్టలేదు. అప్పట్లో తరిగొండలో పది టమాటా మండీలు నిర్వహించేవారు. సుమారు 62 గ్రామాల చెందిన రైతులు ఇక్కడి మండీలకు టమాటాలను తీసుకొస్తుంటారు. అప్పట్లో ప్రతిరోజు సుమారు 1,500 టన్నుల టమాటాలు ఇక్కడి మండీలకు వచ్చేవి. కనీస వసతులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో బయట ప్రాంతాలకు టమాటాలను తీసుకెళుతున్నారు.

వివాదాస్పదంగా స్థలం ఎంపిక

తరిగొండలో టమాటా మార్కెట్‌యార్డు నిర్మాణానికి స్థలం ఎంపికలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. యార్డు నిర్మాణానికి అవసరమైన మూడున్నర ఎకరాల స్థలం కోసం రెవెన్యూ అధికారులు అప్పట్లో తరిగొండ దర్గా సమీపంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎదురుగా రెండు చోట్ల సర్వే చేశారు. రెండుచోట్ల ఎక్కడైనా యార్డు నిర్మించుకోవచ్చని అప్పట్లో రెవెన్యూ అధికారులు అనుమతి ఇచ్చారు. కానీ స్థలం ఎంపిక వివాదాస్పదంగా మారడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. దీంతో యార్డు నిర్మాణం కలగానే మిగిలిపోయింది.

నిధులు వెనక్కి..



తరిగొండ మార్కెట్‌యార్డు నిర్మాణం కాలగానే మారిపోయింది. గతంలో టమాటా మండీల నిర్మాణాలకు రూ.1.34 కోట్లు మంజూరయ్యాయి. అప్పట్లో స్థలం ఎంపికలో జాప్యం జరిగిన కారణంగా సకాలంలో నిర్మాణాలు చేపట్టలేదు. దీంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయి.

- కుమార్‌రెడ్డి, పూర్వ మార్కెట్ కమిటీ కార్యదర్శి, వాల్మీకిపురం

రైతులకు సౌకర్యంగా ఉంటుంది



తరిగొండలో టమాటా మార్కెట్‌యార్డు నిర్మాణంతో రైతులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. గతంలో మండీల నిర్మాణాలకు నిధులు మంజూరు అయ్యాయి. వందలాది మంది రైతులు గతంలో ఇక్కడి మండీలకు టమాటాలను తీసుకొచ్చేవారు. యార్డు నిర్మాణం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిర్మాణానికి కృషి చేస్తా.

- తరిగొండ నౌషాద్‌అలీ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, వాల్మీకిపురం

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



హౌసింగ్ అధికారులను విచారిస్తున్న సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి

కలికిరి: కాలనీ ఇళ్ల నిర్మాణాలు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ శాఖ అధికారులను మదనపల్లి సబ్ కలెక్టరు చల్లా కల్యాణి ఆదేశించారు. గురువారం ఉదయం కలికిరి మండలంలోని కలికిరి పంచాయతీ కొత్తపల్లి హౌసింగ్ లేఔట్‌ను సబ్ కలెక్టరు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కాలనీలో ఇప్పటివరకు ఎన్ని ఇండ్లు నిర్మాణాలు పూర్తయ్యాయి, నిర్మాణ దశలో ఉన్నవి, అసలు ఇప్పటి వరకు నిర్మాణాలకు నోచుకోని లబ్ధిదారుల వివరాలను హౌసింగ్ అధికారులను విచారించారు. అనంతరం లబ్ధిదారులతో ప్రభుత్వం అందచేస్తున్న బిల్లులపై విచారించారు. నిర్మాణాలు పూర్తికాగానే ఆయా స్థాయిలలో బిల్లులు మంజూరు చేయాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. అలాగే కలికిరి గ్రామ పంచాయతీకి సంబంధించి డంపింగ్ యార్డును పరిశీలించిన ఆమె వర్మి కంపోస్టు తయారీ, విక్రయంపై ఆరా తీశారు. కలికిరి-3 గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి సిబ్బంది హాజరుపట్టికను పరిశీలించారు. తహసీల్దారు హరికుమార్, డీటీ సయ్యద్, ఎంపీడీఓ మహమ్మద్ రియాజ్, ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

రామసముద్రం : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ గఫూర్ సూచించారు. గురువారం మండలంలోని కేసీ పల్లె పంచాయతీ గుంతయంబాడి గ్రామంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ప్రజల వినతిమేరకు గ్రామంలో పైప్‌లైన్ లీకేజీ, నీటి కుళాయిల ఏర్పాటు, మరమ్మతులకు గురైన వీధిలైట్లు పరిశీలించి వెంటనే వీధిలైట్లు రిపేరు చేయించి, పైప్‌లైన్ లీకేజీ మరమ్మతులు చేయాలని పంచాయతీ సెక్రటరీ మారెప్పకు సూచించారు. అలాగే ఇటీవల వర్షానికి వీధుల్లో నిలిచిన వర్షపు నీటిని తొలగించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందుజాగ్రత్తలు శుభ్రం చేయాలని ఆదేశించారు.

ఆడికృత్తిక ఉత్సవాలకు ఆహ్వానం

మదనపల్లె రూరల్ : మండలంలోని నిమ్మనపల్లెరోడ్డు శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానంలో రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్న ఆడి కృత్తిక మహోత్సవాలకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామి కృపకు పాత్రులు కావాలని ఆలయ వ్యవస్థాపకులు రాచపల్లి సుబ్రహ్మణ్యం, అనూరాధ కోరారు. గురువారం వారు మీడియాతో మాట్లాడుతూ ఆగస్టు 15వ తేదీ శుక్రవారం కావళ్ల పండుగ జరుగుతుందన్నారు. 16వ తేదీ శనివారం ఉదయం 7.50 గంటల నుంచి స్వామి దర్శనం, 11 గంటలకు అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయ ఆవరణలో త్వరలో 36 అడుగుల అభయవరద సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాన్ని నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆడికృత్తిక మహోత్సవాలకు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

మదనపల్లె: శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని టూటౌన్ సీఐగా రాజారెడ్డి తెలిపారు. రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐగా రాజారెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ రామచంద్ర ఎర్రచందనం విభాగానికి బదిలీ అయ్యారు. దీంతో రాజారెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా ఆయన అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెంచి, నేరాల అదుపుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి

గుర్రంకొండ: విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని తహసీల్దార్ లక్ష్మీప్రసన్న సూచించారు. గురువారం మండలంలోని టి.కుమ్మరపల్లె ప్రాథమిక పాఠశాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు పరిశీలించారు. విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలపై వారిని అడిగి తెలుసుకొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పకడ్బందీగా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనం పథకం సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు వడ్డించే భోజనంలో మెనూ తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో శ్రీనివాసులు, ఉపాధ్యాయులు తనూజ, రమణ పాల్గొన్నారు.

ప్రతి ఇంటా మువ్వన్నెల జెండా ఎగరాలి

కలకడ : పంద్రాగస్టు సందర్భంగా ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగురవేయాలని ఎంపీడీఓ జగదీశ్వర్ కోరారు. గురువారం మండలంలోని కలకడ టౌన్ మూడురోడ్లు కూడలి వరకు సర్పంచ్ ప్యారీజాన్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బందితో కలిసి హర్‌ఘర్ తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. దేశ భక్తిని ప్రతి ఒక్కరిలో పెంపొందించేందుకు హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించామని ఎంపీడీఓ తెలిపారు. జెండా వందనం కార్యక్రమంలో మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

మిట్స్‌కు బెస్ట్ కళాశాల అవార్డు



అవార్డు అందుకుంటున్న చాన్స్‌లర్ విజయభాస్కర్ చౌదరి

కురబలకోట: అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు బెస్ట్ కళాశాలగా అవార్డు లభించింది. ప్రధానోత్సవ వేడుకలు గురువారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీ చాన్స్‌లర్ నాదేళ్ల విజయభాస్కర్ చౌదరి అనంతపురం జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్ హెచ్. సుదర్శనరావు నుండి ఈ అవార్డు అందుకున్నారు. సుదర్శనరావు మాట్లాడుతూ రాష్ట్ర ఐఎస్‌టీఈ 2024 సంవత్సరానికి మిట్స్ కళాశాలకు ఈ అవార్డు రావడం గర్వకారణమన్నారు. ఎందరో విద్యార్థుల జీవితాల దశ దిశలను మార్చిందన్నారు. ఉత్తమ ఇంజినీరింగ్ కళాశాలగా ఎంపిక కావడానికి సహాయ సహకారాలు అందించిన మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ ఎన్. విజయభాస్కర్ చౌదరికి అభినందనలు తెలియజేశారు. ప్రతాప్ సింహ్ కాకాసాహెబ్ దేశాయ్, జి. రంగ జనార్దన్, పాటూరి రవీంద్రబాబు, టీఎస్ఎస్ బాలాజీ, శివప్రసాద్ రెడ్డి, ప్రో చాన్స్‌లర్ ఎన్. ద్వారకనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు శక్తియాప్ రక్షణ కవచం

మదనపల్లె రూరల్ : మహిళలు, బాలికలు, విద్యార్థినులను శక్తియాప్ రక్షణ కవచంగా ఆదుకుంటుందని శక్తి టీమ్ ఎస్ఐ గాయత్రి తెలిపారు. గురువారం పట్టణంలోని చారిత్రాత్మక బిసెంట్ దివ్యజ్ఞాన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలీస్ శక్తిటీం సభ్యులు విద్యార్థులకు పోక్సో చట్టం, సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వాడకంతో కలిగే అనర్థాలు, వివిధ రకాల నేరాలు, వాటి నుంచి రక్షణ పొందడంపై వివరించారు. డయల్ 100, డయల్ 112 నంబర్లకు ఈ యాప్ నుంచే నేరుగా కాల్ చేయవచ్చని తెలిపారు. విద్యార్థినులు తమ ఫోన్‌లోనే కాకుండా తమ తల్లిదండ్రులు, బంధుమిత్రుల ఫోన్లలోనూ శక్తియాప్ డౌన్‌లోడ్ చేయించి ఉపయోగాలు వివరించి చెప్పాలని సూచించారు.



శక్తియాప్ ప్రయోజనాలను వివరిస్తున్న శక్తి టీం

కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీదేవి, అధ్యాపక సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మలిగి రాఘవరెడ్డి, అధ్యాపకులు డాక్టర్ శైలజ, డాక్టర్ డి.శ్రీనివాసులు, డాక్టర్ జి.చిన్నారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రంగస్వామి, మునికుమార్‌నాయక్, మణికంఠ, ఉమెన్ కానిస్టేబుల్స్ శశికళ, వీణాకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

కేవీపల్లె : ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాసులు కోరారు. గురువారం మండలంలోని గుండ్రేవారిపల్లె క్రాస్‌లో ఆటో కార్మికులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేస్తే ఆటో కార్మికులు నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మికులు రఫీ, అంజి, క్రిష్ణ, మంజు, బాలకృష్ణ, మణి, కన్నయ్య, మునిరాజ, శీను, అనీల్, తిరుమలేష్, నాగార్జున, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కురబలకోట: రాష్ట్రంలో మహిళలకు ఫ్రీ బస్సు పథకం నేపథ్యంలో ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. అంగళ్లు ఆటో స్టాండ్ వద్ద గురువారం ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్సు పథకం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఆటో డ్రైవర్లు రోడ్డున పడాల్సి వస్తుందన్నారు. అందువల్ల ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని కోరారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్లు

ఉల్లి కోస్తేనే కాదు.. పండించినా కన్నీరే

- రోజురోజుకు పతనమవుతున్న ధర
- లబోదిబోమంటున్న రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్న అన్నదాతలు

పెద్దతిప్పసముద్రం: ఉల్లి పంట సాగు చేసి పండించిన రైతులకు కన్నీరే మిగిలింది. మార్కెట్లో ధర పడిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉల్లి పంటను విక్రయిస్తే పెట్టిన పెట్టుబడి గిట్టుబాటు అవడం లేదు. పంట చేతికొచ్చే సమయానికి అమాంతంగా ధర పడిపోతుందని, నిల్వ చేసుకుందామంటే పాడైపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రైతులు ధరలు పెరిగాక అమ్ముకుందామని నిల్వ చేసుకున్నారు. అయితే ఇటీవల కురుస్తున్న వర్షాలకు సంచుల్లో నిల్వ చేసిన ఉల్లికి మొలకలు రావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మండల వ్యాప్తంగా సుమారు వెయ్యి ఎకరాలకు పైగా రైతులు ఉల్లి పంట సాగు చేశారు. ఒక్కో ఎకరాకు రూ.60 వేల దాకా ఖర్చు పెట్టారు. దిగుబడి బాగా వస్తే 60 కిలోల నికరంతో ఎకరాకు 150 నుంచి 200 బస్తాలు వస్తాయి.



సంచుల్లో నిల్వ చేసిన ఉల్లి బస్తాల వద్ద రైతు

సాగు ఖర్చులు కూడా రాని వైనం

ధరలు ఆశించిన స్థాయిలో ఉన్నా కూడా ఖర్చులన్నీ పోగా ఎకరాకు రూ.80 వేల దాకా రాబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో 60 కిలోల బస్తా ఉల్లి ధర రూ.250ల నుంచి రూ.300లు పలకడంతో రైతులు ఉల్లిని నిల్వచేస్తున్నారు. అయితే మూడు నెలల నుంచి ఉల్లి ధరలో ఎలాంటి మార్పు లేకపోవడంతో బస్తాల్లో నింపిన ఉల్లి నుంచి మొలకలు రావడంతో రైతులు కంట తడి పెడుతున్నారు. పెట్టుబడి కూడా రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి రైతు ఉల్లిని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

సిబ్బంది సమయం పాటించాలి

గుర్రంకొండ: పశు వైద్య సిబ్బంది సమయం పాటించాలని మదనపల్లె పశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌నాయుడు ఆదేశించారు. గురువారం స్థానిక పశువైద్యకేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించారు. సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పశువైద్య సిబ్బంది, అధికారులు పాడి రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. పశు బీమా పథకంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సర్వే ద్వారా పాడిరైతుల వివరాలతోపాటు వారికి అవసరమైన రుణాలు కూడా రికార్డు చేయాలని తెలిపారు. దీంతో పాడి రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ పశువైద్యాధికారిని అనూరాధ, వెటర్నరీ అసిస్టెంట్ దేవేంద్ర పాల్గొన్నారు.

రూ. 20 లక్షలతో సంత అభివృద్ధి

పీలేరు రూరల్ : రూ. 20 లక్షలతో వారపుసంత అభివృద్ధి చేయనున్నట్లు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా తెలిపారు. గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు వారపు సంతకు నాబార్డు నిధులు మంజూరయ్యాయని, ఈ నిధులతో వారపు సంతలో షెడ్లు, ప్లాట్‌పాం, రోడ్ల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పంచాయతీ అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు. సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవో లతీఫ్‌ఖాన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నౌషాద్, వార్డు మెంబర్లు మల్లికార్జునరెడ్డి, నాగభూషణం, శ్రీనాథరెడ్డి, రమణ, ఉదయ్‌కుమార్, విక్టరీ వెంకటరమణారెడ్డి, కాలేషా, అబీద్, షాజహాన్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

'కెనరా విద్యాజ్యోతి' విద్యార్థులకు వరం

పీలేరు : కెనరా విద్యాజ్యోతి పథకం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు వరం లాంటిదని కెనరాబ్యాంక్ మేనేజర్ లోకేష్ అన్నారు. గురువారం స్థానిక కోటపల్లె జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కెనరా విద్యా జ్యోతి పథకం స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. విద్యార్థినులు డి. అనూష, బి. వర్షిత, డి. హేమలతలకు రూ. 5 వేలు చొప్పున, యస్. సంజన, అనిత, బి. లక్ష్మీ, ప్రియలకు రూ. 3 వేలు చొప్పున మొత్తం రూ. 24 వేలు స్కాలర్‌షిప్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి భవిష్యత్తు తరగతి నుంచి మొదలవుతుందని, స్కాలర్‌షిప్పులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రెడ్డిబాబురెడ్డి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం

కలకడ : మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీ ఆర్పింటిదిన్నె గ్రామానికి చెందిన కేతంరెడ్డి శివరాణి, కొండారెడ్డి కుమార్తె అఖిల, భువనేశ్వర్‌రెడ్డి వివాహం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి కుమార్‌నాయుడు, జిల్లా పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి మోహన్ రాజనాయుడు, మండల ప్రధానకార్యదర్శి. కుమార్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు హరినాథనాయుడు, ఆనందరెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విరబూసిన బ్రహ్మకమలాలు

మదనపల్లె: బ్రహ్మ కమలాలు ఓ ఇంట్లో విరబూశాయి. స్థానిక బైపాస్‌రోడ్డులో నివాసముంటున్న మనిగే భాస్కర్‌నాయుడు ఇంట్లో బ్రహ్మ కమలాలు విరబూశాయి. బుధవారం రాత్రి చెట్టుకు పదులసంఖ్యలో కమలాలు పూశాయి. బ్రహ్మకమలం వికసించడం చాలా అదృష్టంగా భావిస్తున్నామని వారు తెలిపారు. బ్రహ్మకమలాలు చూడటానికి పట్టణంలోని ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చి పూజలు చేశారు.



హార్సిలీహిల్స్‌లో గదులు ఫుల్

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై అతిథి గృహాలన్నీ ఫుల్ అయ్యాయి. కొండపై టూరిజంతోపాటు ప్రైవేటు అతిథి గృహాల నిర్వహణ సాగుతోంది. శుక్రవారం నుంచి మూడు రోజులు వరుస సెలవులు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులు ముందుగానే గదులను బుక్ చేశారు. దీంతో ఒక్క గది కూడా అందుబాటులో లేదు. దీనితో సందర్శకులు విడిది చేసేందుకు గదులు లేవని, విడిది కోసం ఇబ్బందులు పడవద్దని నిర్వాహకులు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీలో నూతన కమిటీల నియామకం

కలికిరి: వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా పార్టీ అధ్యక్షులు ఆకేపాటి అమర్నాథరెడ్డి ఆధ్వర్యంలో నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ మేరకు కలికిరి మండలం నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలకు రాష్ట్ర, జిల్లా స్థాయి పదవులతో పాటు నియోజకవర్గం, మండలం, గ్రామ స్థాయిలో వివిధ హోదాలలో సముచిత స్థానం కల్పించి, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాలు అందచేసి అభినందించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కలికిరికి చెందిన మాసూం రఫీ, ఎస్సీసెల్ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా వడ్డి హరి నియమితులయ్యారు.

జిల్లా పార్టీ, అనుబంధ విభాగాలలో..

జిల్లా ఉపాధ్యక్షులుగా పీఏసీఎస్ మాజీ చైర్మెన్ నల్లారి శ్రీకర్ రెడ్డి, బరిణేపల్లి శ్రీకాంత్ యాదవ్(వాణిజ్య విభాగం కార్యదర్శి), సయ్యద్ జుబేర్ అహ్మద్(మైనార్టీ సెల్ కార్యదర్శి), చదివే సాయి సరణ్ రెడ్డి(యూత్ విభాగం కార్యదర్శి), మూలింటి రాజేశ్వరి(మహిళ కార్యదర్శి), కంభం రామచంద్రారెడ్డి(రైతు విభాగం కార్యదర్శి), రెడ్డివారి మధుసూదన్ రెడ్డి(మేధావుల విభాగం కార్యదర్శి), కాల్లి రియాజ్ అహ్మద్(వైద్యుల విభాగం కార్యదర్శి), వితలం డాక్టర్ రమణ (వైద్యుల విభాగం ఉపాధ్యక్షులు), గుర్రంకొండ యుగంధర్ (యూత్ విభాగం కార్యవర్గ సభ్యులు), జెట్టి శామ్యూల్(క్రిస్టియన్ మైనార్టీసెల్ ప్రధాన కార్యదర్శి), మాలతోటి నరేష్ (విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులు), నంగి మునిరెడ్డి(బిసి సెల్ కార్యదర్శి)లను నియమించారు.



చింతల రమేష్‌కుమార్ రెడ్డికి నియామక పత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు నియోజవర్గంలో..

నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులుగా పసల భాస్కర్ రెడ్డి, క్రిస్టియన్ మైనార్టీ విభాగం అధ్యక్షులుగా జూపల్లి రామచంద్ర, ఆర్టీఐ విభాగం అధ్యక్షులుగా మద్దిరాళ్ల మల్లికార్జున నియమితులయ్యారు.

మండల కార్యవర్గం..

మండల పార్టీ అధ్యక్షులుగా చింతల రమేష్‌కుమార్‌రెడ్డి, వాసునూరి వెంకటపతి, వేంపల్లి బావాజీ, సిపి శివకుమార్‌రెడ్డి, గడ్డం గోపెమ్మ, సయ్యద్ ఇస్తియాక్ అహ్మద్, కంభం ద్వారకనాథ రెడ్డి, చింతల అమరనాథరెడ్డి, కొత్తపల్లి గోవింద రెడ్డి, శివయోగి జగన్నాథకుమార్, టి.గోపాలక్రిష్ణారెడ్డి, బి.రెడ్డెప్ప, వాసునూరి మునెయ్య, సొదాగర్ రిజ్వానుల్లా, ఎస్‌పీఎస్ అల్తాఫ్, వాసునూరి వీరభద్ర, ఆరమడక రామక్రిష్ణ, మనేరి నాగరాజ, బండి రామయ్య, చీమలపెంట నూరుల్లా, కంభం ఆనందరెడ్డి, షేక్ జహీద్, గంటా గురునాథ, కంభం శ్రీకాంత్ రెడ్డి, వాసునూరి విజయ్, తుమ్మలకుంట విజయ రెడ్డి, కొత్తపల్లి వేణుగోపాల్‌రెడ్డి, మూరే మదన్మోహన్ రెడ్డి, జరుగుమల్లి వీరభద్రయ్య, కొండ్రు మల్లికార్జున, చింతపర్తి సహదేవ, తరిగొండ నాగరాజ, జగన్నాథం రమేష్, వేంపల్లి ఖాదర్ బాషా, గుండ్లూరు రజాక్ సాహెబ్, ఖాన్ ఖలీల్, షేక్ చాన్‌బాషా, షేక్ అమానుల్లా, ఊటుపల్లి క్రిష్ణమూర్తి, చింతపర్తి ఓబుల్ రెడ్డి, గుట్టపల్లి గంగయ్య, బాలిరెడ్డి చిన్న రెడ్డెప్ప, వాసూనూరి శివయ్య, ఓర్సు ధనుంజయ, షేక్ జాకీర్, బండి శ్రీకాంత్, పుర్రు ఆనంద, గుండ్లూరు రాజగోపాల్, గల్లా వెంకటరమణ, జరుగుమల్లి ప్రభాకరయ్య, పసుపులేటి రెడ్డెప్ప, షేక్ మలంగ్‌షా, మర్రిపాడు అల్లాబక్షు, గోరంట్ల కోదండరామిరెడ్డి, వడ్డి జ్యోతి, యస్.మస్తాన్, వరుదు భానుప్రకాష్, షేక్ హుస్సేన్ అలీ, జరుగుమల్లి గణేష్, సంకు రవికుమార్, యర్రమరెడ్డిగారి సునీల్‌కుమార్‌రెడ్డి, నాయబ్ ఉస్మాన్ అలీ, బాడుగల అక్రం సాహెబ్ తదితరులకు వివిధ హోదాలలో మండల పార్టీ, అనుబంధ విభాగాలలో చోటు దక్కింది.

గ్రామ కమిటీ అధ్యక్షులు

షేక్ హనీఫ్(కలికిరి), శివయోగి శివాజీ(మర్రికుంటపల్లి), తూపల్లి జయప్రకాష్ రెడ్డి(మొర్రంకిందపల్లి), చిన్నమట్లి రెడ్డెప్ప రెడ్డి(మేడికుర్తి), కంభం మహేంద్రరెడ్డి(పారపట్ల), షేక్ నూరుల్లా(పల్లవోలు), బూడిదేటి జగన్ మోహన్ రెడ్డి(చీకటిపల్లి), షేక్ రౌనఖ్ బాషా(గండ్లూరు), గుర్రం మురళినాథ రెడ్డి(అద్దవారిపల్లి), షేక్ షబ్బీర్(మహల్) కొండ్రు అశోక్ కుమార్(మునెళ్ళపల్లి), పఠాన్ బావాజీ(టి.సండ్రావారిపల్లి)లను నియమించి వారికి మాజీ ఎమ్మెల్యే నియామక పత్రాలు అందచేశారు.